## జాయింట్ ఎల్పీఎంలను తొలగించాలి ..

- జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధవన్



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఎస్.కోట. ఫిబ్రవరి 10 :** జాయింట్ ఎల్పీఎంలను తొలగించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధవన్ ఆదేశించారు. ఆయన మంగళవారం ఎస్.కోట మండలంలో పర్యటించారు. ఇందులో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని జేసి సందర్శించి, పట్టాదారు పాసుపుస్తకాల తయారీ ప్రక్రియను పరిశీలించారు. ప్రజల నుండి వచ్చే దరఖాస్తులను పరిశీలించి, ముఖ్యంగా భూ సంబంధిత సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను జాయింట్ కలక్టర్ ఆదేశించారు. రెవెన్యూ క్లినిక్ కు వచ్చిన అర్జీలపై ఆరా తీసి, జాయింట్ ఎల్పీఎంలను సుమోటోగానే పరిష్కరించాలని ఆదేశించారు. మ్యుటేషన్ల విషయంలో ఎటువంటి జాప్యం జరగకుండా చూడాలని సూచించారు. తప్పులు లేని పట్టాదారు పాసుపుస్తకాలకు రూపొందించి పంపిణీ చేయాలని ఆదేశించారు. పర్యటనలో తహసీల్దార్ డి.శ్రీనివాసరావు, ఇతర రెవెన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీముఖలింగం వేడుకలకు వైద్యుల విరాళం



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం, ఫిబ్రవరి 10:** శ్రీముఖలింగం మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నరసన్నపేట ప్రైవేట్ వైద్యులు తమ వంతు సహాయంగా 1లక్ష 60వేల రూపాయల విరాళాన్ని సేకరించి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు మంగళవారం అందజేశారు. ఈ విరాళం అందించిన వారిలో డా. బలగ మురళి 20వేలు, బగ్గు సరోజినీ దేవి ఆసుపత్రి, గొలివి ఆసుపత్రి, డా. పొన్నాడ గణేష్, డా. తాడేల శ్రీకాంత్, డా. బలగ రమణారావు-అమృత, డా. బోర సాయిరామ్, డా. రాజేంద్ర-కిరణ్ మాధురి, డా. అనిల్-కృషి, డా. పొన్నాన గురునాథం, డా. రెడ్డి సంధ్య తలా 10వేలు చొప్పున అందించారు. భక్తుల సౌకర్యార్థం వైద్యులు సామాజిక బాధ్యతతో ముందుకు రావడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే డా. పాగోటి శంకర్, డా. సూరాపు కృష్ణారావు-సుధారాణి, డా. మెండ ప్రవీణ్-పద్మావతి, డా. తర్రా సురేష్, డా. బల్కా నవీన్, డా. రెడ్డి భార్గవ్, డా. బలగ రమేష్ లు తలో 5వేలు, డా. గురుదేవ్ 3వేలు, డా. ప్రకాష్ 2వేలు తమ వంతు సహాయం అందించారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో డి.సి.హెచ్.ఎస్ డా. కల్యాణ్ బాబుతో పాటు వైద్యులు గణేశ్వరరావు, మురళి బలగ, భార్గవ్, శంకర్ రావు పాల్గొన్నారు.ద

## సబ్‌డిపోను ప్రారంభించిన మండల పార్టీ అధ్యక్షులు.



**గుమ్మలక్ష్మీపురం ఫిబ్రవరి 10,పెన్ పవర్.** మండలంలో గల నోంద్రుకోన గ్రామంలో నూతనంగా మంజూరైన సబ్‌డిపోను ప్రభుత్వ విప్&కురుపాం శాసనసభ్యులు తోయక జగదీశ్వరి ఆదేశాల మేరకు మంగళవారం నాడు గుమ్మలక్ష్మీపురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్ రిబ్బన్ కట్ చేసి సబ్‌డిపోను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మాట్లాడుతూ,గిరిజన ప్రజలకు అవసరమైన నిత్యావసర సరుకులు అందుబాటులో ఉండేలా,సమయం ఆదా చేసేందుకు ఈ సబ్‌డిపోను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇకపై సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామంలోనే సరుకులు పొందే సౌకర్యం కల్పించబడిందని తెలిపారు. దశాబ్దాలుగా ఎదురవుతున్న సమస్యకు పరిష్కారం లభించిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ,తమకు సబ్‌డిపో అందుబాటులోకి తీసుకొచ్చిన కురుపాం ఎమ్మెల్యేకు ఈ సందర్భంగా గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పత్తిక ముసురు,బీజేపీ మండల కన్వీనర్ కద్రక అప్పలస్వామి,తహసీల్దార్ శేఖరం,పౌరసరఫరాల శాఖ అధికారులు,వినియోగదారులు,తదితరులు పాల్గొన్నారు


## న్యాయవాదులు జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలి



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విజయనగరం. ఫిబ్రవరి 10 :** మార్చి 14వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్ ను న్యాయవాదులు అందరూ విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం బబిత పిలుపునిచ్చారు. న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులతో మరియు అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీ న్యాయవాదులతో, మరియు వాది ప్రతివాదుల న్యాయవాదులతో జాతీయ లోక్ అదాలత్ పై సమావేశం నిర్వహించారు. ప్రమాద బీమా క్లెయిమ్ కేసులు అన్ని సివిల్ దావాలు వచ్చే నెల 14వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్ లో పరిష్కరించుకోవాలని, అందుకు జాతీయ లోక్ అదాలత్ ను వేదికగా చేసుకుని ఎక్కువ కేసులు రాజీ చేసి కక్షిదారులకు డబ్బు సమయం వృధా కాకుండా చూడాలని పిలుపునిచ్చిరు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఏ కృష్ణ ప్రసాద్, విజయనగరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కలిసెట్టి రవి రవిబాబు, బార్ కార్యదర్శి సురేష్, సీనియర్ న్యాయవాదులు బార్ అసోసియేషన్ సభ్యులందరూ పాల్గొన్నారు.

# మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి .

- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్
- మొగదాలపాడులో మత్స్య ఉత్పత్తుల తయారీపై శిక్షణ ప్రారంభం




**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, గార. ఫిబ్రవరి 10:** మహిళలు స్వయంకృషితో అభివృద్ధి చెందుతూ ఆర్థికంగా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆకాంక్షించారు. గార మండలం మొగదాలపాడు గ్రామంలో నాబార్డ్ ఆర్థిక సహకారంతో, జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 15 రోజుల మత్స్య ఉత్పత్తుల విలువల జోడింపు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మహిళలను స్వయం సమృద్ధి దిశగా నడిపించేందుకు ఇటువంటి శిక్షణలు దోహదపడతాయని తెలిపారు. ముఖ్యంగా మొగదాలపాడు బీచ్‌కు వచ్చే పర్యాటకులను దృష్టిలో ఉంచుకుని, నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా మంచి లాభాలు గడించవచ్చని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు వ్యక్తిగతంగా లేదా గ్రూపులుగా ఏర్పడి వ్యాపారం ప్రారంభించేందుకు బ్యాంకుల ద్వారా తగిన రుణ సదుపాయం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. శిక్షణ కాలంలో ప్రతిరోజూ రూ. 50 ప్రోత్సాహకం కూడా అందజేస్తామని వెల్లడించారు.

30 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ఈ 15 రోజుల్లో రెడీ-టు-కుక్ పద్ధతిలో చేపలు, రొయ్యల పచ్చళ్లు, చేపల ఫిల్లెట్లు, నగెట్స్ తయారీ, ఉత్పత్తుల ప్యాకేజింగ్, బ్రాండింగ్, ఫుడ్ సర్టిఫికేట్ పొందే విధానంపై శిక్షణ ఇవ్వనున్నారు. నాబార్డ్ డీడీఎం రమేష్ కృష్ణ మాట్లాడుతూ.. ఆధునిక పద్ధతుల్లో తయారు చేసిన మత్స్య ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. మహిళా మార్ట్‌లు, ప్రదర్శనల ద్వారా వీటిని విక్రయించడం వల్ల మహిళలు నెలకు రూ. 10 వేల నుంచి రూ. 20 వేల వరకు అదనపు ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఏ డీపీఎం నారాయణరావు, ఏపీఎంలు, గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, స్థానిక ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## 29వ వార్డు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ





**విశాఖ దక్షిణ పెన్ పవర్ ఫిబ్రవరి 10:** విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ 29వ వార్డు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. విశాఖ సౌత్ జోన్ కార్యాలయం మొదటి అంతస్తులో ఉన్న విజన్ యూనిట్ ప్లాన్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.

29వ వార్డు నివాసితులు జంపా సుశీల, పైడితల్లి కు సంబంధించిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు అంగటి శ్రావణ కుమార్, మన్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం మంజూరు చేసినందుకు లబ్ధిదారులు ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## పేద కుటుంబాల దత్తతే లక్ష్యంగా పి4 సర్వే సమీక్ష

ఎంపీడీవో బిహెచ్వి రమణబాబు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి10:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో పి4 సర్వేపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీడీవో బిహెచ్వి రమణబాబు అధ్యక్షత వహించగా, కలెక్టర్ కార్యాలయం నుండి ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రమణబాబు మాట్లాడుతూ, పేదరికంలో ఉన్న కుటుంబాలను గుర్తించి వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం పి4 పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ పథకం ద్వారా బంగారు కుటుంబాలుగా గుర్తించిన పేద కుటుంబాలను ధనికులు, ఉద్యోగస్తులు దత్తత తీసుకుని వారి అభివృద్ధికి సహకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలు, పరిసర ప్రాంతాలలో అనేక మంది పేదరికంతో జీవిస్తూ విద్య, వైద్యం, రోడ్లు వంటి మౌలిక వసతుల లేమితో బాధపడుతున్నారని పేర్కొన్నారు. అటువంటి కుటుంబాలను గుర్తించి సేవా దృక్పథంతో సహకరించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. జీకే వీధి మండలంలో సుమారు 11 వేల మంది పేదలు ఉన్నారని, వారి అభివృద్ధికి అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో రమణబాబు కోరారు. ఈ సమావేశంలో పి4 సర్వే అమలు విధానం, పేదల గుర్తింపు, సహకార చర్యలపై విస్తృతంగా చర్చించారు.

## కురాసింగిలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించిన అటవీశాఖ.




**గుమ్మలక్ష్మీపురం ఫిబ్రవరి 10,పెన్ పవర్.** గుమ్మలక్ష్మీపురం మండలం మండ,బిటి పరిధిలో గల ఖురాసింగి గ్రామంలో అటవీ శాఖ అధికారి కురుపాం రేంజర్ గంగరాజు ఆదేశాల మేరకు సోమవారం నాడు ఫారెస్ట్ బీట్ అధికారి నీలామణి ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణ పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు నీలామణి మాట్లాడుతూ. వచ్చేది వేసవికాలం కావడంతో అటవీ ప్రాంతాల్లో మంటలు పెట్టడం గాని చెట్లు నరకడం గానీ చేయరాదని దానివలన వన్యప్రాణులు,మూగజీవులు,ఎనో రకాల సుగంధ, మరియు ఔషధ,వృక్షాలు కోల్పోతామని ఆయన అన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ఉండే అటవీ ప్రాంతంలో గంజాయి వంటి మొక్కలను సాగు చేయరాదని చేసినట్లుయితే చట్టపరమైన శిక్షలను అనుభవిస్తారని గ్రామ ప్రజలకు అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమంలో బేస్ కేంప్ వచర్ పోలీనాయుడు,అటవీశాఖ సిబంది,మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నాబార్డ్ -రామ్ కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం






**కొయ్యూరు, పెన్ పవర్ ఫిబ్రవరి 10 :** మండలంలోని బంగారుపేట గ్రామపంచాయతీ, రాజుపేట-బట్ట పనుకులు గ్రామం లో నాబార్డ్ మాతోట ప్రాజెక్ట్3 కింద రామ్ కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. మంగళవారం పశు వైద్య అధికారి డా. రాజేష్ ఆధ్వర్యంలో, పశు వైద్య సిబ్బంది, సహాయక సిబ్బంది సహకారంతో నిర్వహించారు. గ్రామానికి చెందిన ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు మరియు కోళ్ల కు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు, వ్యాక్సిన్లు ఉచితంగా అందజేశారు. అనంతరం రైతులను ఉద్దేశించి వైద్యాధికారి రాజేష్ మాట్లాడుతూ... ప్రత్యేకంగా వైరస్ ఇన్ఫెక్షన్‌ల కారణంగా వచ్చే వ్యాధుల నివారణపై దృష్టి సారించి వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించబడింది. అలాగే పశువుల ఆరోగ్య సంరక్షణ, వ్యాధుల నివారణ మరియు పరిశుభ్రతపై రైతులకు అవగాహన కల్పించారు.

ఈ పశు వైద్య శిబిరం వలన గ్రామంలోని జంతు సంపద ఆరోగ్యం మెరుగుపడి, రైతుల ఆర్థిక భద్రత మరియు ఆదాయం పెరుగుతుందని రైతులు తెలిపారు. ఈ కార్యక్రమం తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొంటూ నాబార్డ్ మరియు రామ్ కీ ఫౌండేషన్ వారికి రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## 66వ బస్సులు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన పల్ల



**గాజువాక :పెన్ పవర్, ఫిబ్రవరి 10 :** మహావిశాఖ నగరపాలక సంస్థ 66వ వార్డులో 3 కోట్ల 50 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు .రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు చేతుల మీదుగా పూజా కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు , వార్డు అధ్యక్షుడు గోమడ వాసు, సీనియర్ జనసేన నాయకుడు గంధం వెంకటరావు,మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ, వార్డ్ కార్యదర్శి ఎండి , పెంటకోట పవన్ కుమార్, లక్కోజి లక్ష్మణరావు, ఎండి భాష, రతన్కాంత్, తారకేష్, బుజ్జి, సాయిరాం, అన్సర్ వలి , జనసేన శంషారాలి, వార్డు మహిళా అధ్యక్షురాలు సరోజిని, ఆశ, మహిళా కార్యకర్తలు అందరూ పాల్గొన్నారు

పల్లా మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం యువత భవిష్యత్తు సమపాలుగా చూసుకునే ప్రభుత్వం మా కూటమి ప్రభుత్వం వార్డ్ లో ఇప్పటికే 20 కోట్ల రూపాయలు వర్కులు చేసాం అని, మునుముందుకు రాజీవ్ మార్గం, బాల చెరువు రోడ్డు ఎన్టీఆర్ విగ్రహం కాంచి పెదగంట్యాడ జంక్షన్ వరకు రోడ్డు విస్తరణకు పనులు జరుగుతున్నాయి అని రాష్ట్ర అధ్యక్షుడు పల్లా తెలిపారు.

## సీతారాముల తీర్థ మహోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



**గాజువాక పెన్ పవర్ , ఫిబ్రవరి 10:** హరిజన జగ్గయ్యపాలెం ప్రజలకు యువకులకు ఆహ్వానం మేరకు తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్ల శ్రీనివాస్ కి జగ్గయ్యపాలెం సీతారాముల తీర్థ మహోత్సవ ఆహ్వాన పత్రికను 69 వ వార్డు తెలుగుదేశం ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో అందజేశారు. గ్రామ సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. త్వరలోనే వాటిని చేస్తామని హామీ ఇచ్చారు . కార్యక్రమంలో అరుంధతి సేవా సంఘము సభ్యులు పాల్గొన్నారు.

## అడవి రాజుల బాబును దర్శించిన సీఐ సుధాకర్



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 10:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలోని గూడెం గ్రామంలో అడవి రాజుల బాబు పండగను భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ పండగ కార్యక్రమంలో గూడెం కొత్తవీధి సీఐ సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ సుధాకర్ అడవి రాజుల బాబు విగ్రహాలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజలందరికీ శుభం కలగాలని దేవుని ప్రార్థించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నసంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్, బీజేపీ నాయకులు రీమలపాల్‌తో పాటు గ్రామస్తులు, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు. పండగ సందర్భంగా గ్రామంలో భక్తిమయ వాతావరణం నెలకొంది.

# సింహాచలంలో అభివృద్ధి పనుల వేగవంతం





- చందనోత్సవ ఏర్పాట్లపై క్షేత్రస్థాయి పరిశీలన
- దేవస్థానం ఆలయ ఈఓ జె. వెంకటరావు

**సింహాచలం, పెన్ పవర్, ఫిబ్రవరి 10 :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం, సింహాచలంలో భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న వివిధ అభివృద్ధి, ఇంజనీరింగ్ పనులను మంగళవారం ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) జె. వెంకటరావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, భద్రతా ప్రమాణాలను ఈఓ నిశితంగా పరిశీలించారు. పనుల నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, భక్తులకు కనీస అసౌకర్యం కలగకుండా నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. రాంబాబు, డీఈ హరి, ఏఈ రవిరాజు, తిరుపతిరావు తదితర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. ప్రత్యేకంగా ఏప్రిల్ 20వ తేదీన నిర్వహించనున్న అత్యంత వైభవోపేతమైన చందనోత్సవం (నిజరూప దర్శనం) నేపథ్యంలో ఈఓ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మహోత్సవానికి లక్షలాది మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో, భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని సూచించారు.

భక్తుల సురక్షిత రాకపోకల కోసం తాత్కాలిక ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాన్ని తక్షణమే ప్రారంభించాలన్నారు. అలాగే, ఆలయ పరిసరాల్లో మౌలిక వసతులను మరింత మెరుగుపరచాలని, భక్తుల కదలికలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. చందనోత్సవం నాడు ఎండ తీవ్రత అధికంగా ఉండే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని, క్యూ లైన్లలో చలువ పందిళ్లు, తాగునీటి వసతి, విశ్రాంతి ప్రాంతాలు వంటి సౌకర్యాలపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం, ఆలయ కార్యాలయంలో ఈఓ ఇంజనీరింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ, చందనోత్సవానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సేవలందించడమే దేవస్థానం యొక్క ప్రథమ ప్రాధాన్యత అని ఈఓ జె. వెంకటరావు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరమణ రాంబాబు, డీఈ హరి, ఏఈ సన్యాసిరావు (తాతాజీ) తదితర అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి, ముందస్తు ప్రణాళికతో అన్ని పనులను సమయానికి పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. భద్రతా పరమైన అంశాలు, మౌలిక వసతుల కల్పన విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రతి చిన్న అంశాన్ని కూడా నిశితంగా పరిశీలిస్తూ ముందుకు సాగాలని అధికారులను ఈఓ అప్రమత్తం చేశారు.

# సింహాచలం దేవస్థానం నూతన ఈఓగా జె. వెంకటరావు

పోలీస్, జివిఎంసీ కమిషనర్లకు మర్యాదపూర్వక భేటీ





**సింహాచలం, పెన్ పవర్, ఫిబ్రవరి 10 :** ప్రపంచ ప్రసిద్ధి గాంచిన సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన జె.వెంకటరావు మంగళవారం విశాఖపట్నం నగరంలోని ప్రముఖ అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా తొలుత విశాఖపట్నం పోలీస్ కమిషనర్ శంఖా బ్రతాబాగ్చి, కార్యాలయంలో దేవస్థానం ఈఓ జె.వెంకటరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీ సందర్భంగా ఆలయ వేద పండితులు సంప్రదాయబద్ధంగా మంత్రపుష్పాలతో వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఈఓ స్వామివారి శేషవస్త్రాన్ని కమిషనర్‌కు కప్పి, ప్రసాదాలను మరియు శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి జ్ఞాపిక చిత్రపటాన్ని బహుకరించారు. ఆలయ పరిపాలన, భక్తుల భద్రత, పండుగలు మరియు ప్రత్యేక ఉత్సవాల నిర్వహణలో పోలీస్ శాఖ సహకారంపై ఇరువురి మధ్య సానుకూల చర్చ జరిగింది.

అనంతరం గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ ను కూడా ఈఓ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు కమిషనర్‌కు వేద ఆశీర్వచనాలు అందజేయగా, ఈఓ స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, జ్ఞాపికను మరియు ప్రసాదాలను అందజేశారు. నగర అభివృద్ధి కార్యక్రమాలు, ఆలయ పరిసరాల సౌందర్యీకరణ, మౌలిక వసతుల అభివృద్ధి, భక్తులకు మెరుగైన సదుపాయాల కల్పన వంటి అంశాలపై ఇరువురు విస్తృతంగా చర్చించారు. ఆలయ అభివృద్ధి పనుల్లో జివిఎంసీతో సమన్వయం మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.

ఈ కార్యక్రమాల్లో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరావు, ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, వేద పండితులు సురేష్ శర్మతో పాటు ఇతర ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. నూతన ఈఓగా బాధ్యతలు స్వీకరించిన జె.వెంకటరావు చేపట్టిన ఈ మర్యాదపూర్వక భేటీలు ఆలయ పరిపాలనకు, భక్తుల సౌకర్యాల మెరుగుదలకు దోహదపడతాయని ఆలయ వర్గాలు అభిప్రాయపడ్డాయి.

# నర్సీపట్నంచింతపల్లి రహదారిపై ప్రమాద నివారణ చర్యలు



**నర్సీపట్నం, పెన్ పవర్ (ఫిబ్రవరి 10) :** జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, నర్సీపట్నం డియస్పి శ్రీనివాసరావు సూచనలతో నర్సీపట్నం రూరల్ సిఐ రేవతమ్మ ఆధ్వర్యంలో ప్రమాద నివారణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా నర్సీపట్నం రూరల్ ఎస్ఐ రాజారావు పోలీసు సిబ్బంది, గబ్బాడ గ్రామ యువత కలిసి నర్సీపట్నం, చింతపల్లి ప్రధాన రహదారిపై గబ్బాడ గ్రామ శివారులో ప్రమాదాలకు లోనయ్యే ప్రాంతాన్ని గుర్తించి భద్రతా ఏర్పాట్లు చేశారు.

ప్రమాదాలు జరగకుండా వాహనదారులు ముందుగానే అప్రమత్తంగా ఉండేందుకు రహదారిపై రేడియం స్టిక్కర్ పోల్స్‌తో కూడిన స్టాపర్లు, ఇసుకబస్తాలను ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో కూడా స్పష్టంగా కనిపించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగింది. ఈ ఏర్పాట్ల ద్వారా వాహనాల వేగాన్ని నియంత్రించి, ప్రమాదాలను తగ్గించడం ప్రధాన లక్ష్యంగా పోలీసులు తెలిపారు. స్థానిక గ్రామ యువత సహకారం ప్రశంసనీయమని అధికారులు పేర్కొన్నారు. రహదారిపై ప్రయాణించే వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటించి జాగ్రత్తగా ప్రయాణించాలని పోలీసులు సూచించారు. ఈ చర్యలతో రాబోయే రోజుల్లో ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల

- సాధనకు న్యాయబద్ధ పోరాటాలు తప్పనిసరి
- కార్మిక సంఘాలకు మాజీ టీఎన్‌టీయూసీ నేత కన్నారావు పిలుపు



**ములగాడ, పెన్ పవర్, ఫిబ్రవరి 10 :** పరిశ్రమల్లో కనీస వేతనాల అమలు, తగిన ప్రయోజనాలు, సౌకర్యాలు కల్పించేలా పరిశ్ర మల యాజమాన్యాలపై ఒత్తిడి పెంచేందుకు కార్మిక సంఘాలు చిత్తశు ద్ధితో న్యాయబద్ధమైన పోరాటాలను రూపొందించుకోవాలని రాష్ట్ర టీఎన్‌టీయూసీ మాజీ నాయకులు, తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు సీహెచ్ కన్నా రావు పిలుపునిచ్చారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గం 59వ వార్డు కొత్తనక్కవానిపా లెంలో ఉన్న కార్యాలయంలో కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కార్మిక సంఘాలు అండగా నిలవాలని, హక్కుల సాధన కోసం సమిష్టి ఉద్యమాలు అవసరమని ఆయన అన్నారు.

యూనియన్ ప్రధాన కార్యదర్శి దేవర అప్పల రాజు అధ్యక్షతన నిర్వహించిన వీఐసీఎల్‌యూ సమావేశంలో 62వ వార్డు సీనియర్ తెలుగుదే శం పార్టీ నాయకులు ప్రసాద్, యూనియన్ ఉపాధ్యక్షులు పల్లా నరసింగరావు, గొలగాని వెంకటరావు, దేవర నాగేంద్ర, రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయ కులు కార్మికుల సమస్యలపై మాట్లాడారు.

కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల కోసం సంఘటి తంగా పోరాడతామని, వారి సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని యూనియన్ ప్రధాన కార్యదర్శి దేవర అప్పలరాజు స్పష్టం చేశారు. సమావేశంలో పెద్ద సంఖ్యలో కార్మికులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గోపాలపట్నంలో రాష్ట్రస్థాయి 5వ సిట్టింగ్ పారా వాలీబాల్ టోర్నమెంట్





- ఘనంగా ప్రారంభించిన పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల
- క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఫిబ్రవరి 10 :** స్థానిక విశాఖ పశ్చిమ, గోపాలపట్నంలోని 92వ వార్డు జడ్పీహెచ్ స్కూల్ ఇండోర్ స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 5వ సిట్టింగ్ పారా వాలీబాల్ టోర్నమెంట్ (బాయ్స్ & గర్ల్స్) ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెందుర్తి నియోజకవర్గ శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు, జనసేన పార్టీ నాయకులు బెహరా భాస్కరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి టోర్నమెంట్‌ను అధికారికంగా ప్రారంభించారు.

అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ, క్రీడలు శరీర దారుఢ్యాన్ని పెంపొందించడమే కాకుండా జ్ఞాపకశక్తి, ఆత్మవిశ్వాసం, మానసిక ఉల్లాసాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ముఖ్యంగా దివ్యాంగ క్రీడాకారులు క్రీడల ద్వారా తమ ప్రతిభను నిరూపిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు.

టోర్నమెంట్‌లో పాల్గొంటున్న క్రీడాకారులందరూ ఉత్తమ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించి రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ప్రభుత్వం మరియు ప్రజాప్రతినిధులు ఎల్లప్పుడూ క్రీడాకారులకు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు.

జనసేన పార్టీ నాయకులు బెహరా భాస్కరరావు మాట్లాడుతూ పారా క్రీడాకారులకు ఇలాంటి రాష్ట్రస్థాయి పోటీలు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తాయని, వారి ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుతాయని తెలిపారు. క్రీడల్లో విజయం సాధించాలంటే క్రమశిక్షణ, పట్టుదల అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు బి.శివదత్, కార్యదర్శి సి.హెచ్.గణేష్, డి.స్వరూప్, జె.ఎన్. సంతోషిరావు, రాపర్తి అప్పారావు, అట్టా శంకర్, రమణ, బలిరెడ్డి శ్రీను, షేక్ వల్లి తదితరులు పాల్గొన్నారు. అలాగే జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఈ రాష్ట్రస్థాయి సిట్టింగ్ పారా వాలీబాల్ టోర్నమెంట్‌లో వివిధ జిల్లాల నుంచి వచ్చిన బాలురు, బాలికలు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు.

# ఎంపీటీసీ భీమరాజును పరామర్శించిన ఎంపీపీ,వైస్ ఎంపీపీలు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఫిబ్రవరి10:** అల్లూరి సీతారామరాజు జిల్లా, గూడెం కొత్త వీధి మండలం దామనపల్లి పంచాయతీ ఎంపీటీసీ భీమారావు (భీమరాజు) అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందిన తరువాత ప్రస్తుతం తన స్వగ్రామమైన భీమవరం గ్రామంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. మంగళవారం గూడెం కొత్త వీధి ఎంపీపీ బోయిన కుమారి, వైస్ ఎంపీపీ సప్పగడ్డ ఆనంద్, మరియు వైసీపీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్ కలిసి భీమరాజు స్వగ్రామమైన భీమవరం గ్రామానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా భీమరాజు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని ఆరోగ్యంగా తిరిగి ప్రజా జీవితంలో రావాలని వారు ఆకాంక్షించారు.

# పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



**నర్సీపట్నం, పెన్ పవర్ (ఫిబ్రవరి 10) :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెట్టుపల్లిలో పదవ తరగతి విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల కార్యక్రమాన్ని ఉప విద్యాశాఖ అధికారి పొన్నాడ అప్పారావు గురువారం ఉదయం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తరగతులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు.

ఈ సందర్భంగా ఉప విద్యాశాఖ అధికారి పొన్నాడ అప్పారావు మాట్లాడుతూ, పదవ తరగతి విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఈ విధమైన ప్రత్యేక తరగతులు ఎంతో దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని సరోజినీ మాట్లాడుతూ, విద్యార్థుల తల్లిదండ్రుల కోరిక మేరకు పాఠశాల ప్రాంగణంలోనే ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధి లక్ష్యంగా ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో డిసిఇబి సెక్రటరీ సత్యనారాయణ, నర్సీపట్నం మండల విద్యాశాఖ అధికారి జిబిఎస్ నాగేంద్ర పాల్గొన్నారు.

# శ్రీ పైడిమాంబ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే గణబాబు



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఫిబ్రవరి 10 :** శ్రీ పైడిమాంబ అమ్మవారి ప్రధాన పండగ మహోత్సవం సందర్భంగా పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ పి.గణబాబు అమ్మవారి ఆలయాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో సందర్శించి ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యే గణబాబుకు ఆలయ ఈవోతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను ఎమ్మెల్యేకు అందజేసి ఆశీర్వదించారు. ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారి చిత్రపటాన్ని అందించి శాలువాతో సత్కరించారు. దర్శనం అనంతరం ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, శ్రీ పైడిమాంబ అమ్మవారి కృపతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించబడే ఈ పండగ మహోత్సవం భక్తులకు ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com